సాక్షి జగిత్యాల

సోమవారం ၊ 31 ၊ జూలై ၊ 2023



జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ స్వామిని ఆదివారం జిల్లా జడ్జి నీలిమ దర్శించుకున్నారు. జిల్లా జడ్జి, వారి కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు, తడిబట్టలతోనే మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రైతాంగానికి ప్రభుత్వం చేయూత



గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: రైతాంగానికి ప్రభుత్వం చేయూతనందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం ధర్మారంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.18 లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదాంను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలతో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణగౌడ్, చెరుకు జాన్ పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న రుద్ర శ్రీనివాస్

మల్లాపూర్(కోరుట్ల): రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ అయినా జనాభా ప్రాతిపాదికన పద్మశాలీలకు 3 ఎంపీ, 10 అసెంబ్లీ, 5 ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాల్సిందేనని తెలంగాణ పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర కళ్యాణ మంపడంలో ఏర్పాటు చేసిన చలో కోరుట్ల యుద్ధభేరి సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ఆగస్టు 13న కోరుట్లలో లక్ష మంది పద్మశాలీలతో 'చలో కోరుట్ల పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి' కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర నాయకులు సాంబారి ప్రభాకర్, గడ్డం మధు, సిరిపురం రవీందర్, రుద్ర రాంప్రసాద్, అయ్యోరి దశరథం, మహేందర్ పాల్గొన్నారు.


దుండగులను శిక్షించాలి



ధర్నా చేస్తున్న గిరిజనులు

మల్లాపూర్(కోరుట్ల): బంజార గిరిజనుల (లంబాడి) ఆరాధ్య దైవం శీత్లాభవానిమాత విగ్రహాలను ధ్వంసం చేసి పూడ్చివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బంజారా గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల కేంద్రం శివారులో ఇటీవలే ప్రతిష్ఠించిన శీత్లాభవాని విగ్రహాలను పూడ్చివేసిన ఘటన ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. సంఘటనస్థలికి పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 28న సంగెం–శ్రీరాంపూర్‌కు చెందిన దేవర సురేశ్‌రావు, మొగిలిపేటకు చెందిన దానవేణి రాజేందర్, ఇబ్రహింపట్నంకు చెందిన పెండ్యాల చిన్నసాయన్న విగ్రహాలను ధ్వంసం చేసి పూడ్చివేశారని ఆరోపించారు. ముగ్గురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ధర్నా చేపట్టారు. దుండగులను కఠినంగా శిక్షిస్తామని ఎస్సై నవీన్‌కుమార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో గుగ్లావత్ రాజేందర్, దేవేందర్, తేజ, రాజేష్, తిరుపతి, శ్రీనివాస్, మురళి, శేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దచెరువు కట్టకు గండి



మెట్‌పల్లి(కోరుట్ల): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పెద్ద చెరువులోకి భారీగా వరద చేరింది. ఈక్రమంలో నిండుకుండలా మారిన చెరువుకట్టకు శనివారం రాత్రి గండిపడింది. దీంతో నీటితో పాటు అందులో పెంచుతున్న చేప పిల్లలు బయటకు తరలిపోతున్నాయి. ఇటీవల గంగపుత్రులు రెండు లక్షల చేప పిల్లలను అందులో వేశారు. ప్రస్తుతం కట్ట తెగడం వల్ల తమకు భారీ నష్టం జరుగుతోందని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పట్టణాధ్యక్షుడు పర్రె శంకర్, ఉపాధ్యక్షుడు కుదుముల సాయన్న ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మేధావులు మేడిన్ ఎస్సారార్



ప్రభుత్వ ఉద్యోగులు.. రాజకీయ నాయకులు.. కవులు.. కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్‌లోని ఎస్సారార్ (శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ) కళాశాల. సాధారణ విద్యార్థిగా చేరి.. విద్యార్థి నాయకులుగా, రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసే కవులుగా సరిహద్దుల్లో రక్షణగా నిలుస్తున్న సైనికులుగా ఇక్కడి ఎన్‌సీసీ కెడెట్లే అధికం. బడుగు బలహీనవర్గాలకు సేవ చేస్తున్న వారిలో ఇక్కడి నుంచే వెళ్లిన ఎన్‌ఎస్‌ఎస్ అభ్యర్థులూ ఉన్నారు. ఇలా అన్ని రంగాల్లో తన విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన ఎస్సారార్ కాలేజీ సగర్వంగా తలెత్తుకు నిలబడింది. కరీంనగర్ నగర నడిబొడ్డున 26 ఎకరాల విస్తీర్ణంలో నిల్చొని విద్యాకుసుమాలను సమాజానికి అందిస్తోంది.



కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ సిటీ: 'కరీంనగర్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు సెలక్షన్స్ జరుగుతున్నాయి. అందులో ఎంపికైన అభ్యర్థుల్లో దాదాపు 70 శాతం మంది ఎస్సారార్‌కు చెందినవారే. ఇది గమనించిన ఓ అధికారి ఆరా తీయగా.. ఆ కాలేజీలో విద్యార్థులకు ఎన్‌సీసీలో ఇచ్చే కఠోర శిక్షణే కారణమని తెలిసింది'

- శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. డిగ్రీ, పీజీ చదువుకున్న ప్రతి వ్యక్తికీ ఈ కాలేజీ తెలుసంటే అతిశయోక్తి కాదు. ఇందులో చదువుకోవాలని ప్రతి విద్యార్థి కల. ఇక్కడ సాధారణ విద్యార్థులే ప్రవేశాలు పొందుతారు. చేరాక విద్యతోపాటు వికాసం, క్రమశిక్షణ(ఎన్‌సీసీ), నాయకత్వం, సామాజిక సేవ(ఎన్‌ఎస్‌ఎస్), పరిశోధనలు(ల్యాబ్), క్రీడలు, కళలు ఇలా అన్ని విధాలా తీర్చిదిద్దబడి బయటకొస్తారు.
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ఈ కాలేజీ 10 జిల్లాల విద్యార్థులకు వరంగా మారుతోంది. కవులు, కళాకారులు, నాయకులు, పోలీసులు, అధికారులు, ఉద్యోగులను సమాజానికి అందించిన ఈ కాలేజీ నాటి వైభవానికి నేటి ఆధునికతకు వారధిగా నిలుస్తోంది.
- శ్రీరాజరాజేశ్వర ఆలయం, వేములవాడ పేరున 1956లో ప్రైవేట్ భాగస్వామ్యంలో కాలేజీని స్థాపించారు. మొదటి ప్రిన్సిపాల్‌గా ఏవీ గోపాల్‌రావు వ్యవహరించారు. 1959లో అప్పటి సర్కారు దీన్ని ప్రభుత్వ కాలేజీగా మార్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు ఈ కాలేజీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగారు. 1959–91 వరకూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రొఫెసర్ చలపతిరావు, ప్రొఫెసర్ కేవైఎల్.నర్సింహరావు హయాంలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. 2018 నుంచి ప్రొఫెసర్ రామకృష్ణ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. కాలేజీ పరిధిలో 2016 వరకు 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు ఉన్నాయి. ఈ కాలేజీలో ప్రస్తుతం 45 డిగ్రీకోర్సులు, 11 పీజీ కోర్సులు, 5 సర్టిఫికెట్ కోర్సులు అందిస్తూ కాకతీయ వర్సిటీ తర్వాత ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద కాలేజీగా గుర్తింపు తెచ్చుకుంది. 2022 మార్చిలో యూజీసీ, న్యూఢిల్లీ నుంచి అటానమస్ హోదా లభించింది. న్యాక్ 'ఏ' గ్రేడ్ హోదా 2027 వరకూ ఉంది. వీటితోపాటు ఐఎస్‌వో సర్టిఫికెట్ కూడా పొందింది.

- విద్యార్థిగా చేరి.. ఉత్తములుగా అవతరించి
- విద్యార్థి నాయకుల నుంచి రాజకీయ నేతలుగా ఎదిగి..
- కవులు, కళాకారుల పుట్టినిల్లు
- మినీ యూనివర్సిటీగా ఖ్యాతి
- 45 డిగ్రీ కోర్సులు, 11 పీజీ కోర్సులు
- 5 సర్టిఫికెట్ కోర్సులు, 1,620 సీట్లు



అవార్డులు.. రివార్డులు

- దేశంలోనే ఎస్సారార్ కాలేజీ గ్రీన్ క్యాంపస్‌గా పేరుగాంచింది. గ్రీన్‌బిల్డింగ్ అవార్డును పొందింది.
- 64 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో యూనివర్సిటీ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు.
- జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయిలో విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులో ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. 10 సార్లు వివిధ సందర్భాల్లో రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకుంది.
- కాలేజీలో డాక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సెమినార్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
- అధ్యాపకులు రాజు, మల్లారెడ్డి, వరప్రసాద్ తోపాటు మరికొందరు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక బహుమతులు అందుకున్నారు.
- డాక్టర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో 3 జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించారు. దీనికి 10 జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి విద్యావేత్తలు హాజరయ్యారు.
- శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డాక్టర్ భిక్షపతి, డాక్టర్ సతీశ్‌కుమార్‌కు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కల్పించారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు (ఫైల్)

ఎన్నో సౌకర్యాలు

- కరీంనగర్ సిటీ మధ్యలో మినీ యూనివర్సిటీగా పిలిచే ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ, పీజీ కాలేజీ 26 ఎకరాల సువిశాల ప్రాంగణంలో విస్తరించి ఉంది.
- 45 డిగ్రీ కోర్సుల్లో 1,620 సీట్లు అందుబాటులో ఉండగా తాజాగా 'దోస్త్' మొదటిఫేజ్‌లో 1,016 సీట్లు భర్తీ అయ్యాయి.
- 108 తరగతి గదులు ఉండగా పూర్తిగా ఆధునీకరించిన బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయలాజీ తదితర 10 ల్యాబ్‌లున్నాయి.
- కాలేజీలో జిమ్, గ్రంథాలయంలో 53,450 పుస్తకాలు, 15 జర్నల్స్, 25 మ్యాగజైన్స్, 18 వార్త పత్రికలు కాలేజీకి చేరుతుంటాయి.
- ఎస్సారార్ వివిధ విభాగాల్లో 67 మంది(వాస్తవానికి 89) అధ్యాపకులు వివిధ విభాగాల్లోని అంశాలు బోధిస్తున్నారు. 42 మంది గెస్ట్‌లెక్చరర్లు, 25 మంది నాన్–టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.



- అతిపెద్ద ఆడిటోరియం, మినీ ఆడిటోరియం కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఎన్‌ఎస్‌ఎస్ ఐదు యూనిట్లలో 600 మంది విద్యార్థులు కెడెట్లుగా ఉన్నారు.
- ఎన్‌సీసీలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, రివార్డులు పొందారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన పలు అడ్వెంచర్ క్యాంపుల్లో ఎస్సారార్ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాలుపంచుకున్నారు.
- ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఐక్యూఏసీ, ఇఫ్లూ బినెట్, మన టీవీ పాఠాలు, జిజ్ఞాస, మూక్స్, టాస్క్, స్వయం ఉపాధి వంటి పథకాలు అమలు చేస్తున్నారు.
- రెడ్డిల్యాబ్, మహీంద్ర వంటి కంపెనీలలో పరస్పరం ఒప్పందంతో విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



అటానమస్ హోదాతో ఉన్న ఎస్సారార్ కాలేజీలో విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం. అధ్యాపకుల సహాయంతో నూతన విధానాలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి పలు సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తున్నాం. దోస్త్ మొదటి ఫేజ్‌లోనే రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు భర్తీ అయ్యాయి. స్వయం ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్, ఎస్సారార్ కాలేజీ(అటానమస్)

నాయకుడిగా జన్మనిచ్చింది



విద్యార్థి రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన కాలేజీ ఎస్సారార్. విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు కాలేజీలోనే అలవడ్డాయి. బీసీ రిజర్వేషన్ల కోసం జరిగిన దేశవ్యాప్త ఉద్యమంలో కాలేజీలో ఎన్ఎస్‌యూఐ తరపున చురుగ్గా పాల్గొన్నాను. అదే నాకు గుర్తింపును తెచ్చింది. ఈరోజు సమాజ సేవ చేసే అదృష్టం లభించిందంటే ఎస్సారార్ కాలేజీనే కారణం.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ

పుష్కలమైన వనరులున్న కాలేజీ



దేశంలో ఏ ప్రైవేటు కాలేజీకీ తీసిపోని అధునాతన సదుపాయాలు ఎస్సారార్ కాలేజీ సొంతం. తరగతి గదులు, మైదానం, గ్రంథాలయం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ల్యాబ్స్ ఒకటేమిటి.. అనంతమైన వనరులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు రత్నాల్లా రాటుదేలుతారు. ఎన్ని ప్రైవేటు కాలేజీలు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగాల్లో అధికశాతం ఎస్సారార్ కాలేజీ విద్యార్థులే సాధించడం ఇందుకు నిదర్శనం.

– వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

నిబంధనలు తూచ్!

లూప్ సాకుతో జిల్లాలో తిష్ట..?

- ఎన్నికల ముందస్తు బదిలీలపై విపక్షాల నజర్
- అధికారుల పొలిటికల్ లింకులపై ఆరా
- ఫిర్యాదులకు సిద్ధమవుతున్న వైనం

కోరుట్ల: 'గత అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం ఎన్నిక వివాదాస్పదంగా మారి హైకోర్టుకు చేరింది. ఓట్ల కౌంటింగ్ సమయంలో ఉన్న అధికార యంత్రాంగంపై ఆరోపణలు వచ్చాయి. వీరిలో కొందరికి ఎన్నికల కమిషన్ నోటీసులు ఇచ్చింది'. అయినా ఎన్నికల ముందస్తు బదిలీల నిబంధనల అమలు విషయంలో ఉన్నతాధికారులు నిర్లిప్తత వదలడం లేదు. ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే రెవెన్యూ యంత్రాంగంలోని అధికారుల్లో కొందరు లూప్‌లైన్ సాకుగా జిల్లాలోనే తిష్ట వేసేందుకు పైరవీలు కొనసాగిస్తున్నారు. ఆ దిశలో మరికొందరు సత్ఫలితాలు సాధించారు. ఈనేపథ్యంలో రాజకీయ పక్షాలకు కొమ్ముకాసే అవకాశమున్న కొంతమంది అధికారుల తీరుపై విపక్షాలు దృష్టి సారించాయి. ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు అందడం గమనార్హం.

బదిలీ మార్గదర్శకాలు ఇవీ..

- ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలతో సంబంధం ఉన్న తహసీల్దార్, ఆపై స్థాయి అధికారులు సొంత జిల్లాల్లో పనిచేయరాదు. గత నాలుగేళ్ల వ్యవధిలో జిల్లా పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న తహసీల్దార్, ఆపై స్థాయి అధికారులను ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ చేయాల్సి ఉంటుంది.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో అసెంబ్లీ సెగ్మెంట్ లేదా జిల్లా పరిధిలో పనిచేసిన ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అదే సెగ్మెంట్ లేదా జిల్లాలో పనిచేయరాదు.



ట్విట్టర్‌లో ఈసీకి అందిన ఫిర్యాదు

- ఎన్నికలతో నేరుగా సంబంధం ఉన్న జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంగ్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులకు బదిలీ మార్గదర్శకాలు అమలు చేయాల్సి ఉంటుంది.

నిబంధనలు తుంగలో తొక్కుతూ..

- ఎన్నికలతో నేరుగా సంబంధం లేదన్న అంశాన్ని సాకుగా చూపుతూ లూప్ పోస్టింగ్‌ల పేరిట ముందస్తు బదిలీల నిబంధనలు తుంగలో తొక్కుతూ కొంత మంది రెవెన్యూ అధికారులు జిల్లాలోనే తిష్ట వేసేందుకు సన్నాహాలు చేస్తుండగా మరికొందరు ఇప్పటికే పోస్టింగ్‌లు పొందారు.
- జిల్లాలో సుమారు పదేళ్లుగా పనిచేస్తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన వివాదంలో ఎన్నికల కమిషన్ నోటీసులు అందుకున్న సొంత జిల్లాకు చెందిన ఓ తహసీల్దార్ మళ్లీ ఇదే జిల్లాలోనే పనిచేస్తుండటం గమనార్హం.
- జిల్లాలో ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లు ఎన్నికలతో సంబంధం లేని లూప్ పోస్టింగ్‌ల్లో డీఏవోలుగా కొనసాగేందుకు యత్నిస్తున్నారని కొందరు ఈసీకి ఫిర్యాదు చేయగా సదరు అధికారులు స్వతహాగా వెనక్కి తగ్గినట్లు సమాచారం.
- జిల్లాలో సుమారు పదేళ్లకు మించి పనిచేసి ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఓ అధికారి ఎన్నికలతో సంబంధం లేని విధుల పేరిట ఓ కొత్త రెవెన్యూ డివిజన్ అధికారిగా పోస్టింగ్ పొందడం గమనార్హం.
- సాధారణంగా ఎన్నికల విధుల్లో ఎంపీడీవోలను సెక్టోరియల్ అధికారులుగా నియమించే అవకాశం ఉంది.
- గతంలో వీరు సెక్టోరియల్ అధికారులుగా పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని సొంత జిల్లాల్లోనే పనిచేస్తున్నవారు ఉన్నారు. కానీ ముందస్తు ఎన్నికల బదిలీలు వీరికి వర్తించడం లేదు.
- ఇలా ఎన్నికలతో నేరుగా సంబంధం లేదన్న సాకు చెబుతూ ఏళ్ల తరబడి జిల్లాలోనే పనిచేస్తున్న కొందరు అధికారులు ఇక్కడే లూప్ పోస్టింగ్‌ల్లో కొనసాగేందుకు యత్నిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

ఫిర్యాదుకు విపక్షాలు సిద్ధం

మరో మూడు నెలల వ్యవధిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నేతలకు కొమ్ముకాసే అవకాశం ఉండి, ఏళ్ల తరబడి స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై ఫిర్యాదులు చేసేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే మెట్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ హాఫీజ్ ఎన్నికల ముందస్తు బదిలీల్లో నిబంధనలు పక్కనపెడుతున్న వైనంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి సెగ్మెంట్లలోనూ ఈసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా జిల్లాలో కొనసాగుతున్న వారిపై విపక్ష పార్టీలకు చెందిన నేతలు లోతుగా సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి ఎన్నికల వివాదం కోర్టుకు చేరిన అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎన్నికల్లో పనిచేసే అధికారుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రతిపక్ష పార్టీలకు చెందిన కీలక నేతలు భావిస్తున్నారు.

మాచాపూర్‌లో తాగునీటి తిప్పలు

- 15 రోజులుగా నల్లా నీళ్లు బంద్

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం మాచాపూర్‌లో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. గ్రామస్తులకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో 60 వేలు, 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఇందులోకి రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం నుంచి మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా నీళ్లు అందించాల్సి ఉంది. అక్కడి నుంచి పైపుల ద్వారా నీళ్లు స్పీడ్‌గా రావడంలేదని అధికారులు ఏళ్లుగా నాన్చుతున్నారు. ఈ క్రమంలో గ్రామశివారులోని బోర్‌బావి నుంచి ట్యాంకులకు నీటి సరఫరా చేయాల్సి ఉండగా, బోరుబావి పనిచేయడంలేదని 15 రోజులుగా నీటిసరఫరా బంద్ చేశారు. దీంతో గ్రామస్తులు గ్రామశివారులోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని బిందెల్లో తెచ్చుకుంటున్నారు. నీటి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు 10 రోజులుగా విన్నవించినా స్పందించడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మండలాధికారులు గ్రామాల్లో పర్యటించకపోవడంతో గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాచాపూర్‌లో తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వ్యవసాయ బావుల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

పంట నష్టంపై సర్వే చేపట్టాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): భారీ వర్షాలు, వరదలకు వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణమే సర్వే జరిపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రేచపల్లి గ్రామంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను ఆదుకునే విషయంలో తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి విముఖంగా ఉందని, కేవలం రైతుబంధు పేరుతో రైతును ఆదుకునే పంటల బీమా పథకాన్ని పక్కనపెట్టారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ పరిహారం అందించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. భారీ వర్షాలతో ఇసుక మేటలు వేసిన పొలాలను తిరిగి సేద్యానికి అనుకూలంగా మార్చడానికి ఎకరాకు కనీసం రూ.50 వేలు ఖర్చవుతాయని పేర్కొన్నారు. అనంతరం కోనాపూర్ వాగు వద్ద కొట్టుకుపోయిన అప్రోచ్‌రోడ్డును పరిశీలించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతో పాటు జన్నారం నుంచి వస్తున్న వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, కొత్తగా మరో అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ ఇబ్రహీం, మేడిపల్లి ఆనందరెడ్డి, బేర మహేష్, అసాది రాజం, కోండ్ర రాంచంద్రారెడ్డి, ఆకుల రాజిరెడ్డి, సామల గంగాధర్, తోడేటి జనార్దన్, ఒడ్నాల రాజిరెడ్డి, దోసారపు కమలాకర్ తదితరులు ఉన్నారు.



దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

ఇదీ తాగునీరే


నల్లరంగులో సరఫరా అవుతున్న తాగు నీరు

యైటింక్లయిన్ కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి ప్రభావిత గ్రామమైన వెంకట్రావుపల్లి కేకేనగర్‌కు సింగరేణి యజమాన్యం సరఫరా చేసిన తాగునీరు నల్లరంగులో వచ్చింది. దీంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నా రు. ఆ నీరు కనీసం కాలకృత్యాలకూ పనికిరాకుండా ఉందని వాపోయారు. సింగరేణి యాజమాన్యం స్పందించి తాగు నీటిని ఫిల్టర్ చేసి అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


సోమరాజు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన బోయోజు సోమరాజు (52) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు, తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సోమరాజుకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడు 12 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా కుమారుడి దినకర్మ నిర్వహించిన రెండు రోజులకు తండ్రి ఆనారోగ్యం పాలై గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. ఈక్రమంలో ఆదివారం చికిత్సపొందుతూ గుండెపోటుకు గురై మరణించినట్లు కుటుంబసభ్యులు, సిబ్బంది తెలిపారు. 10 రోజుల వ్యవధిలోనే కుమారుడు, తండ్రి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు అందరిని కలిచివేశాయి. సోమరాజు మృతికి టూటౌన్ సీఐ వేణుగో పాల్, రామగుండం సీపీ అధికారులు సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం , పోలీస్ సిబ్బంది మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి వారిని ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న నల్ల మనోహర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ పట్టణానికి చెందిన బోనగిరి సమ్మయ్య బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి గాయాల పాలైన సమ్మయ్యను ఆటోలో చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా ప్రాథమిక చికిత్సచేసిన వైద్యులు తదుపరి చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

మంథని: మండలంలోని సూరయ్యపల్లి శివారులో మాజీ ఎంపీటీసీ బీముని వెంకటస్వామిపై అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం గ్రామ సమీపంలోని పొలంవద్దకు వెళ్లిన స్వామిపై ఒక్కసారిగా అడవిపంది దాడిచేసింది. దీంతో తీవ్రగా గాయపడిన అతడిని స్థానిక వైద్యశాలలో ప్రథమచికిత్స అందించి కరీంనగర్‌కు తరలించారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

- జిల్లాలో పాడవుతున్న తారురోడ్లు
- ఏటా కోట్లాది రూపాయలతో మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్న పోలీసులు


రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

జగిత్యాల అగ్రికల్చర్ : వ్యవసాయ పనులు జోరందుకోవడంతో రైతులుసాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పొలాలు దున్నేందుకు ట్రాక్టర్లను ఉపయోగించడం సర్వసాధరణంగా మారింది. ట్రాక్టర్లకు రకరకాల పరికరాలతో రైతులు తమ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. పొలాలు దున్నేందుకు ట్రాక్టర్ వెనుక టైర్లను తొలగింది, కేజ్‌వీల్స్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో రోడ్లపైనుంచి కేజీవీల్స్‌తో వెళ్తుండటంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. జిల్లాలో కోట్లాది రూపాయలతో వేసిన ఆర్‌అండ్‌బీ రోడ్లు,పంచాయతీరాజ్‌రోడ్లన్నీ పాడవుతున్నాయి.

జిల్లాలో 15వేలకు పైగా ట్రాక్టర్లు

జిల్లాలో దాదాపు 15 వేల ట్రాక్టర్లను రైతులు వినియోగిస్తున్నారు. దీనికి తోడు ఏటా కనీసం వెయ్యి నూతన ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నారు. పొలాలు దున్నే సమయాల్లో రైతులు ఫుల్ కేజ్‌వీల్స్‌ను బిగిస్తున్నారు. దీంతో రోడ్లపై వెళ్తుండటంతో తారురోడ్లన్నీ ధ్వంసమై కంకర రోడ్లుగా మారుతుంది.

వేసిన ఏడాదిన్నరకే..

ఒకసారి తారురోడ్డు వేస్తే, దాదాపు 15 ఏళ్లపాటు ఉంటుంది. కానీ కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు తారురోడ్డుపై వెళ్తుండటంతో ఏడాదిన్నరకే చెడిపోతున్నాయి. కిలోమీటర్ మేర తారురోడ్డు వేయాలంటే కనీసం రూ.15నుంచి 20 లక్షలు ఖర్చవుతుంది. జిల్లాలో 1190 కి.మీ మేర ఆర్ అండ్‌బీ రోడ్లు, పంచాయతీ రాజ్ కింద 4,026 కి.మీ రోడ్లు ఉన్నాయి. రోడ్లపై కేజీవీల్స్‌తో నడపటంతో జిల్లాలో ఏటా దాదాపు రూ. రెండు నుంచి మూడువందల కోట్ల నష్టం వాటిల్లుతుంది. మరమ్మతులకు కోట్లాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. పోలీస్, రెవెన్యూ అధికారులు కేజీవీల్స్‌తో రోడ్లపై వెళ్లే ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాలని సూచిస్తున్నారు. దీంతో ముందుగానే ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

రోడ్ రింగ్‌ను అమర్చాలి

రైతులు రోడ్లు ధ్వంసం కాకుండా చూడాలి. కేజ్‌వీల్స్‌కు రోడ్ రింగ్‌ను అమర్చడం మినహాయించి, మరో మార్గంలేదు. రెండు రింగుల్ని కలిపి రోడ్ రింగ్‌ను ఏర్పాటు చేయాలి. ఈ రెండు రింగుల్ని నాలుగు బోల్టుల సాయంతో కేజ్‌వీల్స్ మధ్య రింగుకు బిగించి తారురోడ్లపై నడపాలి. ట్రాక్టర్ పొలం వద్దకు వెళ్లగానే రోడ్ రింగ్‌ను తీసియేయొచ్చు. ఇనుముతో తయారు చేసే రోడ్ రింగ్ రూ.2 వేలలోపు ఉంటుంది. దీంతో 80 శాతం రోడ్లను ధ్వంసం కాకుండా ఉంటుంది.

రోడ్లు పాడవుతున్నాయి



గ్రామాల్లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై నడపడంతో ఏళ్ల తరబడి ఉండాల్సిన రోడ్లు రెండేళ్లకే పాడైపోతున్నాయి. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధుల వెంట తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా అధికారులు, రైతులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

– ముద్దం ప్రభాకర్, సీనియర్ న్యాయవాది, జగిత్యాల

కేజ్‌వీల్స్‌తో నడిపితే చర్యలు



కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను తారురోడ్డు, సిమెంట్ రోడ్లపై నడిపితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్యం కల్పిస్తున్నాం. చాలా చోట్ల జరిమానాలు విధించాం అవసరమైతే కేసులు నమోదు చేస్తాం. రైతులు రోడ్లు ధ్వంసంకాకుండా కేజ్‌వీల్స్‌కు రోడ్డు రింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

– భాస్కర్, ఎస్పీ

జనాభా ప్రాతిపదికన పోలీసు నియామకాలు చేపట్టాలి

జగిత్యాలటౌన్: పోలీసు నియామకాల్లో కొన్ని జిల్లాలకే ప్రయోజనం కలిగేలా తెచ్చిన జీవో 46ను రద్దు చేసి జనాభా ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. తెలంగాణ ఏర్పాటు స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు నియామకాల్లో సైబరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలతో పాటు సంగారెడ్డి జిల్లాల కానిస్టేబుల్ అభ్యర్థులకు 53శాతం రిజర్వేషన్ కల్పించి రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు కలిపి కేవలం 47శాతం మాత్రమే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 46తో ఇతర జిల్లాల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. హోంగార్డులకు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా లేకపోవడంతో పదవీకాలం అనంతరం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు హోంగార్డుల ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరారు.

కమ్మునూర్ గోదావరిలో మొసలి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గోదావరి తీరంలో వారం రోజులుగా వస్తున్న వరదలకు మొసలి కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం అటువైపు వెళ్లినవారికి నీటిలో మొసలి కనిపించిందని, గోదావరిలోకి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పొలంలో లారీ బోల్తా

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చిన్న పాపయ్యపల్లి గ్రామంలో ఆదివారం ఓ లారీ అదుపుతప్పి, వరి పొలంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడగా స్థానికులు బయటికి తీసి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


నుజ్జునుజ్జయిన ఆటో

మానకొండూర్: ఆటోను ఓ లారీ ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం 5 గంటలకు లారీ హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తోంది. మానకొండూర్ మండలంలోని ఖాదర్‌గూడెం స్టేజి సమీపంలో కరీంనగర్ –వరంగల్ ప్రధాన రహదారిపై కరీంనగర్ నుంచి బెల్లం బుట్టలతో హుజూరాబాద్ వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జవగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ తరలించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్

గోదావరిఖని: మహారాష్ట్ర నుంచి పెద్దపల్లికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీచేస్తుండగా అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. పెద్దపల్లికి చెందిన కల్లెపల్లి గోపి, కట్కూరి నగేశ్, ఈర్ల శంకర్ మహారాష్ట్రలోని జమీల్ అనే వ్యక్తినుంచి కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా ఆకస్మిక తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ఆటోతో పాటు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామగుండం తహసీల్దార్ సమక్షంలో పంచనామ నిర్వహించి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

వరద బాధిత రైతులను ఆదుకోవాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


కల్వర్టును పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్, నాయకులు

పెగడపల్లి(ధర్మపురి): భారీ వర్షాలకు మండలంలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వెంగళాయిపేట– లింగాపూర్, శాలపల్లి– అడుపపల్లి దారుల్లో తెగిన కల్వర్టులు, నంచర్లలో దెబ్బతిన్న పంటపొలాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడుపపల్లి గ్రామస్తులు శాలపల్లికి రాకపోకలు సాగించేందుకు రహదారి లేక అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నంచర్లలో సుమారు 50 ఎకరాల్లో వరినాట్లు వేసిన పంట దెబ్బతిని ఇసుక మేటలు వేశాయన్నారు. దెబ్బతిన్న పంటలను అధికార యంత్రాంగం, మంత్రి ఈశ్వర్ పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి తలెత్తగా ప్రభుత్వం నయాపైసా పరిహారం చెల్లించలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టం జరిగితే తగిన పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, మంత్రి చొరవచూపి తెగిన కల్వర్టుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయించి పనులు జరిపించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల అధ్యక్షుడు రాములుగౌడ్, సర్పంచ్‌లు గోలి మహేందర్‌రెడ్డి, ఈరెల్లి శంకర్, నాయకులు సంది మల్లారెడ్డి, పూసల తిరుపతి, చాట్ల విజయభాస్కర్, మల్లేశ్, లచ్చయ్య, మద్దెల సుధీర్, ఇప్ప గంగారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అంజయ్య, రమేశ్ పాల్గొన్నారు.

మద్యంతాగి విధుల్లోకి..

ధర్మారం: మండలంలోని కొత్తూరు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మద్యం తాగి ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన గజ్జెల మహేందర్‌ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం విద్యుత్‌శాఖ పెద్దపల్లి డివిజనల్ ఇంజినీర్ దాసరి తిరుపతి ఉత్తర్వులు జారీచేశారు. మద్యంతాగిన మహేందర్ సంబంధిత విద్యుత్‌శాఖలో ఫీల్డ్‌వర్కు చేస్తున్న లైన్‌మెన్‌ల టెలిఫోన్‌లకు స్పందించకపోవడంతో పాటు సరిగా సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసులచే బ్రీత్ అనలైజర్ టెస్టు...

కొత్తూరు సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌కు పోలీసులు శనివారం సాయంత్రం బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహేందర్‌కు సాయంత్రం కటికెనపల్లిలో 11కేవీ లైన్‌లో సమస్యతలెత్తడంతో లైన్‌మెన్ ఆపరేటర్‌కు ఫోన్‌చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి ఆపరేటర్ ఫోన్‌తీయడం లేదని వెంటనే ఎల్‌సీ ఇప్పించాలని కటికెనపల్లి లైన్‌మెన్ ఫోన్‌లో తెలిపాడు. సదరు సిబ్బంది సైతం ఆపరేటర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. వెంటనే వారు ధర్మారం ఏఈకు సమాచారం ఇవ్వగా సబ్‌స్టేషన్‌కు వెళ్లి చూడాలని ఆదేశించారు. సదరు సిబ్బంది సబ్‌స్టేషన్‌కు వెళ్లి చూడగా ఆపరేటర్ నిద్రలో ఉన్నాడు. నిద్రలేపేందుకు యత్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పరిస్థితిని ఏఈకి వివరించారు. అనారోగ్యానికి గూరికావొచ్చని భావించిన ఏఈ వెంటనే కొత్తూరు సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆపరేటర్‌తో మాట్లాడగా మద్యంమత్తులో ఉన్నట్లు గమనించి ఏడీకి ఫిర్యాదు చేశారు. ఏడీ పెద్దపల్లి విద్యుత్‌శాఖ డివిజనల్ అధికారికి ఫోన్‌లో వివరించారు. పోలీసులకు ఫిర్యాదుచేసి బ్రీత్ అనలైజర్ చేయించాలని డీఈఈ సూచించారు.

పోలీసులకు ఫిర్యాదు..

విధుల్లో ఉన్న ఆపరేటర్ మద్యంమత్తులో డ్యూటీ చేస్తున్నాడని ధర్మారం ఎస్సై సత్యనారాయణకు ఏఈ ఫిర్యాదుచేశారు. స్పందించిన ఎస్సై వెంటనే కానిస్టేబుల్‌ను కొత్తూరు సబ్‌స్టేషన్‌కు పంపించి బ్రీత్ అనలైజర్ పరీక్ష చేశారు. దీంతో 240 రీడింగ్ చూపించినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను ఏడీ పెద్దపల్లి డీఈఈకి శనివారం సాయంత్రం పంపించారు. నివేదిక ఆధారంగా ఆదివారం ఆపరేటర్‌ను సస్పెన్షన్ చేస్తూ డీఈఈ ఉత్తర్వులు జారీచేశారు. సబ్‌స్టేషన్‌లో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాల్సిన ఆపరేటర్ తాగిన మత్తులో డ్యూటీ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తితే ఫీల్డ్‌లో ఉండే సిబ్బంది ఆపరేటర్‌పైనే ఆధారపడి ఎల్‌సీ తీసుకుని పనులు చేస్తుంటారు. తాగిన మత్తులో డ్యూటీచేస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశాలుంటాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేటర్‌పైనే ఆధారపడి తాము విద్యుత్ తీగలపై పనిచేస్తుంటామన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


పంటలను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

మెట్‌పల్లి: పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, మేడిపల్లి, చెర్ల కొండాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది ఎకరాల్లో వరి, సోయా, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పంటల నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. మేడిపల్లి వద్ద చెరువులో పూడిక తీయకపోవడంతో ఏటా వర్షాకాలంలో వరద నీటితో జాతీయ రహదారి మునుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. ఇక్కడ నాయకులు బైరి పెద్ద సాయన్న, పసునూరి శ్రీనివాస్, కేశపాక తరుణ్, తదితరులున్నారు.

‘అల్ఫోర్స్’ అధినేతకు సన్మానం


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి ప్రతిష్టాత్మక ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని వావిలాలపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాల మెయిన్ క్యాంపస్ లో ఆయనను ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకొని, జిల్లా కీర్తిని చాటాలని సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

కూలీల కొరతకు చెక్

- వరి నారు లాగేందుకు కొత్త ఉపాయం
- వెదురుబుట్టతో రోజూ మూడెకరాల వరకు నారు వేస్తున్న యువకుడు


వెదురుబుట్టతో సురేశ్

సారంగాపూర్: వరినాట్లు ముమ్మరం కావడంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. బిహార్ నుంచి వచ్చిన కూలీలు అక్కడక్కడ నాట్లు వేస్తున్నారు. ఇదే సమయంలో నారు మళ్ల నుంచి నాటు వేసే మడులకు నారును తీసుకెళ్లేందుకు కూలీల కొరతతో పాటు కూలీ రేట్లు కూడా పెరిగాయి. దీంతో మండలకేంద్రానికి చెందిన చాతరాసి సురేశ్ అనే యువకుడు రెండు ఎడ్లకు వెనకాల వెదురుతో అల్లిన బుట్ట (పొనక)ను కట్టి రోజూ మూడెకరాల వరకు నారు లాగుతున్నాడు. అవసరమున్న వారికి ఎకరాకు కొంత ధరతోపాటు ఇతరులకు నారుపొనక, ఎడ్లతో నారు లాగేందుకు వెళ్తున్నాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1989–90 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఇందుకు మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్ వేదికైంది. 33 ఏళ్ల తరువాత అప్పటి మిత్రులు సుమారు 60 మంది ఒకేచోట కలుసుకుని రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. సర్పంచులు అనంతరెడ్డి, తిరుపతి, మాజీ ఎంపీటీసీ శివరాజం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలి


సిరికొండలో తెగిన రోడ్డును పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్ నాయకులు

కథలాపూర్ (వేములవాడ): భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సిరికొండ, తాండ్ర్యాల, గంభీర్‌పూర్, ఇప్పపెల్లి గ్రామాల పరిధిలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ఉధృతికి చెరువులు, కుంటలు, రోడ్లు తెగిపోయాయని, ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, ఎండీ హఫీజ్, రేహన్, తొట్ల అంజయ్య, కల్లెడ గంగాధర్, జవ్వాజి చౌదరి, దొమ్మాటి అర్జున్‌గౌడ్, సాయితేజ, వినోద్ పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో జిల్లా జడ్జి పూజలు


పూజల్లో పాల్గొన్న జిల్లా జడ్జి నీలిమా


ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్డీవో

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని ఆదివారం ప్రముఖులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా జడ్జి నీలిమా, ఆర్డీవో నర్సింహమూర్తి పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు ప్రముఖులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. సూపరింటెండెంట్ సునీల్ ఏఎస్‌ఐ శ్రీనివాస్ అర్చకులు చిరంజీవ స్వామి, రాంచంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి దగ్ధం

చందుర్తి(వేములవాడ) : వ్యవసాయ పొలం వద్ద పనిముట్లను భద్రపర్చుకునేందుకు నిర్మించిన స్టోర్ రూంలోని వస్తువులను శనివారం రాత్రి దగ్ధం చేశారు. మండలంలోని జోగాపూర్‌కు చెందిన మ్యాదరి శంకరయ్య అనే రైతు పొలం వద్ద నిర్మించిన గది తలుపులు పగులగొట్టి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడేశారు. ఎరువుల బస్తాలతో పాటు మంచాన్ని దగ్ధం చేశారు. సుమారు రూ.50వేలపైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ సంఘటనకు పాల్పడింది గుర్తు తెలియని వ్యక్తులా ? లేక పాత కక్షలతో ఎవరైనా దగ్ధం చేశారా అన్నా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లకు చెందిన పెకుడ రాధవ్వ (52) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. కాగా ఆదివారం రాధవ్వ మృతిచెందింది. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు దాతలు చందాలు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్ మాట్ల మధు, బీఆర్ఎస్ నాయకులు పబ్బతి విజయేందర్ రెడ్డి, మిరాల భాస్కర్ యాదవ్ చందాలు అందజేశారు.